# 'మెరుగైన పాలనకు సూచనలివ్వండి'

కడప కలెక్టరేట్, న్యూస్‌లైన్ :

ప్రభుత్వపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. మరింత సమర్థవంతమైన పాలన అందించడానికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రజల మెరుగైన సూచనలను వినియోగించుకుంటామన్నారు. ఉత్తమ సూచనలు, సలహాలు ఇచ్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద ₹ 1500, ₹ 1000, ₹ 500 నగదుతోపాటు ప్రశంసాపత్రాన్ని ఇస్తామన్నారు. సూచనలు, సలహాలు పరిశీలించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన అదనపు జేసీ, జెడ్పీ సీఈఓ కమిటీ సభ్యులుగా ఉంటారని వెల్లడించారు. ప్రజలు ఈనెల 31వ తేదీలోపు తమ సలహాలు జిల్లా రెవెన్యూ అధికారి, కలెక్టర్ కార్యాలయం, కడప అనే చిరునామాకు పంపాలని సూచించారు.

## ఎస్ఎంఎస్ ద్వారా 'ప్రజావాణి' సమాచారం

ప్రజావాణిలో ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారం ఎంతవరకు వచ్చిందన్న విషయాన్ని తెలుసుకోవాలంటే ఇకనుంచి ఎస్ఎంఎస్ ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ అర్జీ నెంబరును తెలుపుతూ పి-అని స్పేస్ ఇచ్చి 94900 31668 అనే నంబరుకు ఎస్ఎంఎస్ పంపాలని సూచించారు. సమస్య పరిష్కారం ఏ స్థితిలో ఉందో వెంటనే తెలియజేస్తామన్నారు.

## ప్రగతి నివేదికలు పంపాలి

ఆగస్టు 15వ తేదీ జరగనున్న స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రులు సందేశం ఇస్తారిని..దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రగతి నివేదికలను ఈనెల 31వ తేదీలోపు డీపీఆర్ఓ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

సాక్షి · 15-07-2011